క్లుప్తంగా

నేడు డెప్యూటీ సీఎం బందరు రాక

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ఉపముఖ్య మంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు గురువారం మచిలీపట్నం రానున్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో రూ.3.98 కోట్లతో నూతనంగా నిర్మించనున్న జిల్లా సమాఖ్య కార్యాలయం, శిక్షణ, సాంకేతిక అభివృద్ధి కేంద్రం భవనాలకు శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డెప్యూటీ సీఎంతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ హాజరుకానున్నట్లు డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా మాజీ మంత్రి, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) వ్యవహరిస్తారు. జిల్లా శాసనసభ్యులతో పాటు కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని డీఆర్డీఏ పీడీ బుధవారం తెలిపారు.

వేదాల మురళీ మోహన్‌కు డాక్టరేట్ ప్రదానం



మోపిదేవి: స్థానిక మహాత్మాజ్యోతీరావు పూలే గురుకుల కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడిగా పనిచేస్తున్న వేదాల మురళీమోహన్‌కు తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ పి.ఉషారాణి నేతృత్వంలో 'చిల్డ్రన్స్ లిటరేటర్ ఆఫ్ రుక్కిన్ బాండ్ ఏ స్టడీ' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. డాక్టరేట్‌ను సాధించిన వేదాలను కళాశాల ప్రధానాధ్యాపకులు కె.వీరరవి, ఇతర అధ్యాపకులు, ఉపాధ్యాయులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

స్వామివారికి భూచక్ర గొడుగులు సమర్పణ



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ సోదరులు, ఆలయ వేదపండితులు నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్యశర్మ భూచక్ర గొడుగులు, తెర సెల్లాలను సమర్పించుకున్నారు. స్వామివార్ల బ్రహ్మోత్సవాల్లో వినియోగించే వీటిని ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావుకు బుధవారం అందించారు. ఆలయ అర్చకులు బుద్దు సతీషశర్మ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌సీ డైరెక్టర్ కరీం మృతి

నివాళులర్పించిన ఎమ్మెల్యే సింహాద్రి





చల్లపల్లి: గ్రామంలోని ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం సీనియర్ నాయకులు అబ్దుల్ కరీం (68) గుండెపోటుతో మృతి చెందారు. కొంత కాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్న కరీం బుధవారం తెల్లవారు ఝామున విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కరీం మృతి వార్త తెలుసుకున్న అవనిగడ్డ ఎమెల్యే సింహాద్రి రమేష్ బాబు స్థానిక రాధానగర్‌లో కరీం భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యన్నారాయణ (నానీ), ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ యడ్ల జగదీష్, మండల పార్టీ యూత్ కన్వీనర్ వెనిగళ్ల జగదీష్, పార్టీ నాయకులు అల్లంశెట్టి చలం, కోట అంజియ్య, మద్దాల వీరాస్వామి, అబ్దుల్ కమాల్, అర్షద్, సయ్యద్ జహీర్, రఫీ, సమీర్, ఖాదర్, జుజ్జువరపు భాగ్యారావు, పరుచూరి వెంకన్నబాబు నివాళులర్పించారు.

ప్రజల చెంతకు పాలనను చేర్చిన సీఎం జగన్

- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు
- రూ.102.54 లక్షలతో నూతన భవనాలు ప్రారంభం



సచివాలయం-2 భవనం ప్రారంభ శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు

నాగాయలంక: సీఎం జగన్ ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు చేర్చారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పేర్కొన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ (వెల్‌నెస్ సెంటర్స్), నాడు-నేడుతో పాఠశాల అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాలు కళకళ లాడుతున్నాయన్నారు. నాగాయలంకలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.78.60 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసుకున్న సచివాలయం-1, సచివాలయం-2 నూతన భవనాలను, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్ర భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులుతో కలసి ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిని ప్రతిపక్షాల నాయకులు ఓర్వలేక నిత్యం దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గ్రామీణ పరిపాలనా వ్యవస్థలను ఒకే గొడుగు కిందకి తెచ్చి సుపరిపాలనకు శ్రీకారం చుట్టిన ఘనత ఆంధ్రప్రదేశ్ ముఖమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కడికే దక్కిందని స్పష్టం చేశారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, గ్రామ సర్పంచి కైతేపల్లి అంకాలు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది వెంకటనారాయణ (చిన్నారి), పీఏసీఎస్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు, తోట కృష్ణ, బీసాబత్తుని ప్రసాద్, పార్టీ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు చెన్ను రంగారావు, ఆకుల బాబీ, రైతునేత బీమా బాబూరావు, తహసీల్దార్ ఎం.సుందరరాజు, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, ఏఓ సంజీవరావు, సచివాలయ సిబ్బంది, ఆర్‌బీకే ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే ప్రారంభం

రేమాలవారిపాలెం(నాగాయలంక): మండలంలోని రేమాలవారిపాలెంలో రైతుభరోసా కేంద్రం నూతన భవనాన్ని గ్రామ సర్పంచ్ చోడిశెట్టి బుజ్జిమ్మ, స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేస్‌బాబుతో కలసి ప్రారంభించారు. జాతీయ ఉపాధి హామీ నిధులు రూ.23.94 లక్షల వ్యయంతో ఈ భవనం నిర్మించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలతో రైతాంగానికి మేలైన సేవలు సకాలంలో అందుతున్నాయని చెప్పారు. పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మరో అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిట్టు



పోతేపల్లిలో సచివాలయాన్ని ప్రారంభించి గ్రామస్తులతో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మరో అవకాశం కల్పిస్తే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తారని ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు తెలిపారు. బందరు మండలం పోతేపల్లి, చిట్టిపాలెం గ్రామాల్లోని సచివాలయాలతో పాటు హెల్త్ క్లినిక్, అరిశేపల్లిలో రైతు భరోసాకేంద్రాన్ని బుధవారం కిట్టు ప్రారంభించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ మాట తప్పని మడమ తిప్పని నాయకుడు ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

పోతేపల్లిలో పేర్ని కిట్టుకు గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. కిలోమీటర్ దూరం మేర పూలవర్షం కురిపిస్తూ తీన్‌మార్ డప్పుల మధ్య యువత చిందులు వేస్తూ ఘనస్వాగతం పలికారు. అడుగడుక్కి ఆలయాల్లో పూజలు చేయించి జై జగన్ జైజై జగన్ వర్ధిల్లాలి పేర్ని నాని నాయకత్వం, జిందాబాద్ పేర్ని కిట్టు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మహిళల హారతులు పట్టి ఆహ్వానం పలికారు. నియోజవకర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, మాజీ ఎంపిటిసి పిప్పిళ్ళ నాగబాబు, పొట్లపాలెం సర్పంచ్ గాజుల నాగరాజు, చిలకలపూడి పిఎసిఎస్ అధ్యక్షుడు నాగబాబు, తపసిపూడి సర్పంచ్ మస్తాన్, బత్తిన అమలేష్, అంజి, అరిశేపల్లి గ్రామ ఇన్‌చార్జ్ చండిక అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్స్ పరివార్ మార్ట్ ప్రారంభం



ఫార్మర్స్ పరివార్ మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: స్థానిక లంకమ్మ అమ్మవారి ఆలయం పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఫార్మర్స్ పరివార్ హోల్‌సేల్ మార్ట్‌ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించి ఆహార ఉత్పత్తులు, మహిళలు తయారు చేసిన పచ్చళ్లు, పిండివంటలకు మధ్య దళారులు లేకుండా నేరుగా కొనుగోలు చేసి, మార్కెట్ సదుపాయం కలిపిస్తున్న ఫార్మర్స్ పరివార్ ఉత్పత్తులను ప్రజలు వాడుకుని ప్రోత్సహించాలన్నారు. దీనివల్ల రైతులు, మహిళలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఫార్మర్స్ పరివార్ సీఈవో తుర్లపాటి సురేష్ మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఫార్మర్స్ పరివార్ హోల్‌సేల్ మార్ట్‌లు తెలంగాణలో 65, ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, మాదుగులలో కొత్తగా అవనిగడ్డలో ప్రారంభించినట్టు చెప్పారు. రైతులు పండించిన ఆహార ఉత్పత్తులు, మహిళలు తయారు చేసిన పిండివంటలు, పచ్చళ్ళను సేకరించి సింగపూర్, మలేసియా, థాయ్‌లాండ్, శ్రీలంక దేశాలకు ఎగుమతి చేస్తున్నట్టు చెప్పారు. మేనేజర్ సాయిజ్యోత్సన మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలంలో ఫార్మర్స్ పరివార్ మార్ట్‌ని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఆర్‌అండ్‌బీ డీఈ వరలక్ష్మి, డీఆర్‌డీఏ ఏసీ రవితో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

- వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము
- గూడూరులో గడప గడపకు మన ప్రభుత్వం



గూడూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఉప్పాల రాము

గూడూరు: రాష్ట్రంలోని ప్రజల స్థితిగతులు మార్చేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని నిండుమనస్సుతో ఆశీర్వదించి మరో అవకాశం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం గూడూరులో ప్రజాదీవెన యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన రాము గత ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. పటాన్‌పేట ఎస్సీకాలనీలో అంతర్గత రోడ్లు, కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టాలని కోరగా.. రోడ్ల నిర్మాణానికి జెడ్పీ నుంచి నిధులు మంజూరు చేయిస్తానని రాము హామీ ఇచ్చారు. స్థానికంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. తనపై నమ్మకం ఉంచి పెడన ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన జగనన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూధనరావు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మోటేపల్లి రత్నారావు, పీఏసీఎస్ చైర్మన్ కారుమంచి కామేశ్వరరావు, సర్పంచి లింగం సులోచనారాణి, వైస్ ఎంపీపీలు నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధరరావు, పార్టీ అధ్యక్షుడు పర్ణం పెదబాబు, నాయకులు గొరిపర్తి రవికుమార్, ఆకూరి శ్రీను, వేము ఆనంద్, బత్తిన త్రినాథ్, వీరంకి సుబ్రహ్మణ్యం, తలుపుల ఫణి తదితరులు పాల్గొన్నారు.

మినుములో తెగుళ్లను నివారించండి

పెడన: మినుము పైరులో ఎండు తెగులు, కాండం గజ్జి, బంగారు తీగలను గుర్తించామని మచిలీపట్నం జిల్లా వనరుల కేంద్రం జిల్లా శిక్షణ సమన్వయకర్త డాక్టర్ కె. జ్యోతిరమణి తెలిపారు. బుధవారం ఆమె నడుపూరు పొలాల్లో మినుము పైరును పరిశీలించి రైతులతో మాట్లాడారు. విత్తన శుద్ధి చేయకపోవడం వల్ల తెగుళ్లు ఆశిస్తున్నాయని స్పష్టం చేశారు. తెగుళ్లను యాజమాన్య పద్ధతులలో నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. బంగారు తీగకు నివారణకు పెండిమిథాలిన్‌ను 48 గంటలలోపు ఎకరానికి ఒక లీటరు తేమ ఉండేలా ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు. కాండంగజ్జి అధికంగా ఉంటే రెడోమిల్ గోల్డ్‌ను ఎకరానికి 300 ఎంఎల్‌ను, ఎండు తెగులు నివారణకు ట్రైకోడెర్మవిరిడిని విత్తనాలు వేసే ముందు పొలంలో దుక్కుదున్నే సమయంలో వేసుకోవాల్సి ఉంటుందన్నారు. పూర్తిస్థాయిలో సమాచారానికి ఆర్‌బీకేలలోని వీఏఏలను, ఎంపీఈవోలను సంప్రదించాలని సూచించారు. డీఆర్‌సీ ఏడీఏ డాక్టర్ కె. శ్రీనివాస్, డీఆర్‌సీ ఏవో వి.పద్మజ, మచిలీపట్నం ఇన్‌చార్జి ఏడీఏ, పెడన ఏవో జీవీ శ్రీనివాసరావు, పెడన వ్యవసాయశాఖ మండల కమిటీ చైర్మన్ కాగిత వెంకటేశ్వరరావు, వీఏఏ మంజూష, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

గూడూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు రూ.లక్ష విలువైన బ్రాడ్ కాస్టింగ్ మానిటరింగ్ సిస్టమ్ అందజేశారు. పూర్వవిద్యార్థులు ఎస్టీజీ వరదాచార్యులు, అలివేలు దంపతుల సౌజన్యంతో అన్ని తరగతులలో విద్యార్థులకు సమాచారం ఇచ్చే వీలున్న మైక్ సెట్‌ను పాఠశాల హెచ్ఎం డి.పుష్పలతకు అందజేశారు. పూర్వ విద్యార్థులు ఆత్మకూరి రాము, పూర్ణిమ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొల్లు వాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

బంటుమిల్లి: మండలంలోని పెదతుమ్మిడి పంచాయతీ పరిధిలో గురువారం వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రమేష్ (రాము) పర్యటిస్తారని మండల పార్టీ అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్ బుధవారం తెలిపారు. గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాము గ్రామంలో పర్యటించి ఇంటింటికీ తిరుగుతూ నవరత్నాల లబ్ధిదారులను కలుస్తారని చెప్పారు. వైఎస్సార్ సీపీని మరలా గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహిస్తారని మహేష్ తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అలరించిన నాట్య ప్రదర్శన

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో బాగంగా బుధవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అభినయ నాట్య అకాడమి కేవీ జ్యోతి శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నాట్య ప్రదర్శన, మోపిదేవి ఆదిశేషు ఆధ్వర్యంలో నిర్వహించిన మురళీ కోలాటం భక్తులను బాగా ఆకట్టుకున్నాయి. ఆలయం వెలుపల ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రతిమలు మెరిశాయి.

పేదల ఆరోగ్య రక్షణకు సీఎం జగన్ కృషి

మేయర్ వెంకటేశ్వరమ్మ



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, కమిషనర్ బాపిరాజు, తదితరులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. నగరంలోని 18, 40 డివిజన్ల పరిధిలోని టౌన్‌హాల్, గొడుగుపేట కన్యకాపరమేశ్వరి సత్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ వైద్యశిబిరాలను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ శిబిరాల్లో పరీక్షల ద్వారా రోగనిర్ధారణ జరిగితే సంబంధిత వైద్యశాలలకు వెళ్లి మెరుగైన వైద్యం పొందేలా వైద్యులు సూచనలు ఇస్తున్నారన్నారు. పెద్ద ఆసుపత్రులకు వెళ్లి వైద్యసేవలతో పాటు ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకునే వీలు కల్పించారన్నారు. గతంలో ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.5 లక్షల మేర ఆరోగ్య సేవలు పొందే వీలు ఉండేదని, ప్రస్తుతం దీనిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.25 లక్షలకు పెంచి వైద్యసేవలు పొందే వీలు కల్పించారన్నారు. ఈ వైద్యశిబిరాలను మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మాజీ డెప్యూటీ మయర్ లంకా సూరిబాబు, 18, 30 డివిజన్ల కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, మిరియాల బసవపూర్ణమ్మ, కమిషనర్ బాపిరాజు, కో-ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, మట్టా తులసి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు, 40వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోళ్ల పాండురంగారావు, సచివాలయ కన్వీనర్లు తరకటూరి సీతారాములు, సంక్రాంతి నరేంద్రకుమార్, పళ్లెం కల్యాణ్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి వేడుక

చిన్నారులకు అక్షరాభ్యాసాలు



రవీంద్ర భారతి స్కూల్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం



కోడూరులో సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మచిలీపట్నంటౌన్: వసంత పంచమి సందర్భంగా నగరంలోని పలు విద్యాసంస్థల్లో పూజలు నిర్వహించారు. విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. సుకర్లాబాద్‌లోని నెల్లూరు రవీంద్రభారతి స్కూల్‌లో వసంత పంచమి పూజలు పురోహితులు ఆధ్వర్యంలో చిన్నారుల తల్లిదండ్రుల సమక్షంలో అక్షరాలు దిద్దించి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట పడాలని దీవించారు. కార్యక్రమంలో స్కూల్ డీన్ శ్రీకాంత్, ప్రిన్సిపల్ సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శ్రీ బాలాజీ విద్యాలయంలో వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పోతుకూచి ఆంజనేయకుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా విద్యాలయం ప్రిన్సిపాల్ కొమరగిరి చంద్రశేఖర్ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. బచ్చుపేటలో సరస్వతిదేవి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

కోడూరు: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాలు, పాఠశాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణాతీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో పంచమి వేడుకలు జరిపారు. అమ్మవారి మూలమూర్తిని సరస్వతిదేవిగా అలంకరించి పూజలు చేశారు. గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు సరస్వతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ సీహెచ్ సుధాకరరావు, అర్చకులు ఏ పార్థసారథి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. స్థానిక రవితేజ, జీవి అకాడమీ పాఠశాలల్లో కూడా పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సరస్వతి హోమాలను శాస్త్రోక్తంగా జరిపారు.

వైభవంగా వసంత పంచమి వేడుక

నాగాయలంక: సరస్వతీదేవి జన్మదినోత్సవంగా పరిగణించే మాఘశుద్ధ పంచమి పర్వదినంగా బుధవారం వసంత పంచమి వేడుకలు పలుచోట్ల సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్థానిక మరుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ప్రాంగణంలో వసంత పంచమి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది బాలలకు విద్యాభ్యాసం చేశారు. వారికి నోట్ పుస్తకాలు, పలకలు, మిఠాయిలు, తల్లిదండ్రులుకు తాంబూలంతో కూడిన గిఫ్ట్‌లు పంపిణీ చేశారు. పాఠశాల అధినేత మండ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మండ పుష్పలత, తలశిల రజని, మాదివాడ అశ్విని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్యువెలరీపార్క్ ఎండీ ప్రమాణ స్వీకారం



కోనేరుసెంటర్: మచిలీపట్నం ఇమిటేషన్ జ్యువెలరీ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా యశశ్రీ గోల్డ్ కవరింగ్ అధినేత చలమలశెట్టి దుర్గావరప్రసాద్ రావు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఇప్పటి వరకు పంచపర్వాల సత్యనారాయణ ఈ పదవిలో కొనసాగగా ఆయన స్థానంలో దుర్గాప్రసాద్‌రావు బాధ్యతలు తీసుకున్నారు. ప్రమాణస్వీకారం చేసిన దుర్గాప్రసాద్‌రావును మునిసిపల్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దేటి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు మట్టా శ్రీనివాసరావు, కార్యదర్శి అంకెం జితేంద్రకుమార్ తదితరులు అభినందించారు. సభ్యులు మొహమ్మద్ రెహమతుల్లా బేగ్, నరహరిశెట్టి వెంకటసుబ్బారావు, గుంటముక్కల రామబ్రహ్మం, దవళేశ్వరపు ఉమామహేశ్వరరావు, సాధు మాల్యాద్రి, సాధు మురళీధర్, పంచపర్వాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన మహిళ తల్లికి అప్పగింత



ఫర్జానాను తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

కోనేరుసెంటర్: మానసిక అనారోగ్యం కారణంగా ఇంటి నుంచి తప్పిపోయిన ఓ మహిళను పోలీసులు ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు. భీమవరానికి చెందిన మహమ్మద్ ఫర్జానా భర్త చనిపోవటంతో మానసికంగా బలహీనపడి మతిస్థిమితం కోల్పోయింది. ఇంటి నుంచి బయటికి వెళ్లిన ప్రతిసారికుటుంబ సభ్యులు ఆమెను ఇంటికి తీసుకెళ్లేవారు. ఈ నెల 11న ఫర్జానా ఇంటి నుంచి బయటికి వెళ్లి ఎంతకీ తిరిగిరాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతుండగా మచిలీపట్నంలో మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై తిరుగుతున్న ఫర్జానాను ఎస్ఐ సత్యనారాయణ గుర్తించారు. ఆమె నుంచి వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఫర్జానా మచిలీపట్నంలో ఉన్నట్లు తల్లి మహమ్మద్ మహారాజ్‌కు చెప్పారు. తల్లి ఇనగుదురుపేట పోలీసులను కలిసింది. దీంతో పోలీసులు ఫర్జానాను తల్లికి అప్పగించగా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది. విషయం తెలుసుకున్న ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి పోలీసులను అభినందించారు.

ఆలయ హుండీ కానుకల లెక్కింపు

కృత్తివెన్ను: కృత్తివెన్నులోని ప్రసిద్ధి గాంచిన శ్రీ దుర్గాపార్వతీ సమేత నాగేశ్వర స్వామి ఆలయ హుండీ కానుకలను బుధవారం లెక్కించినట్లు ఆలయ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. గత 11 నెలల కాలంలో వచ్చిన కానుకలను లెక్కించగా రూ.4,84,954 ఆదాయంగా వచ్చినట్లు వివరించారు. మధ్యాహ్నం 2 గంటలకు దేవదాయ శాఖ తనిఖీదారు కె.శ్రీనివాసరావు సమక్షంలో హుండీని తెరిచి కానుకలను లెక్కించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పట్టపు నాగేశ్వరరావు, అర్చకులు మురళీకృష్ణశర్మ, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

కోనేరుసెంటర్: బందరు మండలం గరాలదిబ్బకు చెందిన ఒడుగు ఏడుకొండలు బుధవారం నగరంలోని ఖోజ్జిలీపేటలో మద్యం బాటిళ్లను రహస్యంగా విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సీఐ పార్థసారథి ఆధ్వర్యంలో ఏడుకొండలును మద్యం సీసాలతో సహా పట్టుకున్నారు. అతని నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. స్టేషన్ పరిధిలో సారా, లిక్కర్ సీసాలు అమ్ముతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు తెలిసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అన్నసమారాధన

కృత్తివెన్ను: కృత్తివెన్ను కాలువగట్టుపై కొలువై ఉన్న సాయిబాబా మందిరం వద్ద 25వ వార్షికోత్సవం బుధవారం ముగిశాయి. గత మూడు రోజులుగా బాబావారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. ఉత్సవాలు ముగింపు రోజున భారీ అన్నసమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై బాబాను దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు.

తరకటూరు ప్రాజెక్టుకు జిల్లాస్థాయి గుర్తింపు



డీఈఓ తాహెరా సుల్తానా నుంచి పురస్కారం అందుకుంటున్న హెచ్‌ఎం గాయత్రి

గూడూరు: ఇన్‌స్పైర్ మనక్ అవార్డులో భాగంగా గోసాలలోని చైతన్య స్కూలులో బుధవారం జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో టీకే జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టులుగా పురస్కారం అందుకున్నాయి. హెచ్ఎం గాయత్రి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు నిహారిక, చిన్నఅమ్ములు రూపొందించిన రెండు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక వడం విశేషం. ఈ సందర్భంగా డీఈవో తాహెరా సుల్తానా చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, సర్పంచి చిన్నం వెంకట రమణమ్మలు విద్యార్థులను, వారికి గైడ్ చేసిన ఉపాధ్యాయులను అభినందించారు.